# దేవస్థానం సీఆర్ఓకు దారెటు..!



5 లో

17వ వసంతంలోకి

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

చిత్తూరు | తిరుపతి

సోమవారం | 27 మే 2024 | పేజీలు 8



## అరకొర విత్తనాలు..

# అన్నదాత ఆపసోపాలు

సరిపడా విత్తనాలు అందించడంలో వ్యవసాయ అధికారి నిర్లక్ష్యం

ప్రభుత్వం ఇస్తామన్న... వ్యవసాయ అధికారి పట్టించుకోలేదు

వ్యవసాయ శాఖ అధికారి తీరుపై రైతులాగ్రహం

ప్రతి ఏటా రైతులకు మొండి చేయి

**చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో ఖరీఫ్ సీజన్లో రైతులు అధిక మొత్తంలో వేరుశనగ సాగు చేస్తారు. సుమారు 3500 హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగు చేస్తారు. ప్రతి ఏటా ప్రభుత్వం రాయితీ కింద వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తోంది. అయితే సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సరిపడా విత్తనాలు రైతులకు తెప్పించి ఇవ్వటంలో వి.కోట వ్యవసాయ శాఖ అధికారి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విత్తనాలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్దేశపూర్వకంగా వ్యవ సాయ శాఖ అధికారి రైతులకు విత్తనాలు అందకుండా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.**

**వి.కోట, మేజర్‌న్యూస్:** గత సంవత్సరంలో వేరుశనగసాగు గణనీయంగా తగ్గింది. దీంతో రైతుల వద్ద విత్తన కాయలు అందు బాటులో లేదు. పొరుగు రైతుల వద్ద తీసు కుందా మంటే అందుబాటులో లేదు. గ్రామాల వారీ గా సాగు రైతులను గుర్తించి వారికి సరి పడ విత్తన కాయలు అందజేయాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖది. అయితే వ్యవసాయ అధి కారి అటువంటి వివరాలు సేకరించలేదు. ఏదో ఒక పాత గణాంకాలను ఉన్నత అధి కారులకు నివేదిస్తారు. వాటిని పరిగణలోకి తీసుకొని అరకొరా విత్తనాలు తెప్పిస్తున్నారు. చేతులు దులుపుకుంటున్నారు. దీని మూలంగా రైతులకు రాయితీ విత్తనాలు దొరకడం లేదు. విత్తనం లేకపోవడంతో మెట్ట భూములు బీడుగా వదిలేయాల్సినదుస్థితి దాప రిస్తోందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సచి వాలయ పరిధిలో 100 హెక్టార్లు పైగా వేరుశనగ సాగు చేస్తే 150 బస్తాల నుండి 300బ్యాగులకు మించి కేటాయించలేదు. దీంతో ఏ రైతుకు కాయలు



మిగతా 2లో

# ఎండోమెంట్ నిధులేమైనట్టు...?

పోలేరమ్మ జాతర నిర్వహణకు.. చందాలే కాకుండా ఎండోమెంట్ నిర్వహణ బాద్యతులు చూసుకుంటుంది

దాతలిచ్చిన దానాలేమైనట్టు?.. అభిషేకాల పేరుతో దండిన ధనమేమైనట్టు?

వీటన్నిటికీ శరఘోపం పెట్టేసినట్టేనా?

హుండీ లెక్కింపులో.. ఎంత ధనం చేతులు మారింది ?

భక్తులు కానుకగా ఇచ్చిన ముక్కుపుడకలు ఏమయ్యాయి ?

ప్రజలు ప్రశ్నిస్తే వీటన్నిటికీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది



**సూర్య ప్రత్యేక ప్రతినిధి నాయుడుపేట:**

ప్రారంభమైన నాయుడుపేట పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం గత 49 సంవత్సరాలుగా అమ్మవారి సేవలో తరిస్తున్న నాయుడుపేట పట్టణ పరిసర ప్రాంత ప్రజలు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని.. ఆ తల్లి కృపాకటాక్షములు పొందుతారు. జాతర సందర్భంగా బంధువులతో.. బలిదానాలతో.. భక్తులతో.. అంబళ్ళపంపిణీలతో.. మొక్కులతో.. ముడుపులతో.. కొత్తశోభ సంత రించుకుంటుంది నాయుడుపేట పట్టణం.. అప్పట్లో నాయుడు పేట, పరిసర ప్రాంతాలన్నీ, వెంకటగిరి రాజావారి పాలనలో ఉండేవి. అం దుచేత జాతర మహోత్సవాన్నికుడా వారి పర్యవేక్షణలోనే నిర్వహిం చేవారు. వారి పాలనానంతరం జాతర మహోత్సవ బాద్యతలు నాయుడుపేటకు చెందిన నల్లబోతుల నాగరత్నం. వంశస్థులుకు అప్పగించారు. రాజావారు అప్పటి నుండి ఆలయ నిర్వహణ బాధ్యత లు గాని, జాతర మహోత్సవ బాద్యతలు గాని వారే 42 సంవత్స రాలుగా అంటే 2017వరకు ఎక్కడా లోటు లేకుండా జాతర మహో త్సవాన్ని ఘనంగా నిర్వహించేవారు. తర్వాత కొన్ని కారణాలవల్ల జాతర మహోత్సవాన్ని, అమ్మవారి దేవస్థానం నిర్వహణను ఎండో మెంట్ వారికి అప్పగించేసారు నాగరత్నం. ఆ తర్వాత కాలంలో ఎండోమెంట్ వారు.. జాతర నిర్వహణను..

మిగతా 2లో

## ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు చేపడుతాం

- అవాంఛిత సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతాం

- జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు



**చిత్తూరు క్రైమ్, మేజర్‌న్యూస్:**

2024 మే 13వ తేదీన రాష్ట్రంలో నిర్వహించిన సార్వత్రిక ఎన్ని కలలో భాగంగా జూన్ 4వ తేదీన జిల్లాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠచందోలు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆది వారం చిత్తూరు పట్టణ పుర వీధులలో డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో 1వ పట్టణ ఇన్స్పెక్టర్ విశ్వనాథ రెడ్డి, 2వ పట్టణ ఇన్స్పెక్టర్ ఉలసయ్య, ఈస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుల్లయప్ప, వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ రెడ్డి సమక్షంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఎస్‌టిఎఫ్ సిబ్బంది, 70మంది కేంద్ర బలాగాలు ఒక వజ్రా వాహనం మొత్తం సుమారు 150 మందితో పట్టణము నందు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం చిత్తూరు గాంధీ కూడలి నుండి మొదలై కోర్ట్ కాంప్లెక్స్, తోటపాల్యం, పొన్నియమ్మన్ గుడి వీధి, ఎం ఎస్ ఆర్ కూడలి, దర్గా కూడలి, లాలూ గార్డెన్, టాప్ లైన్, చర్చి వీధి చివరగా 1వ పట్టణ పోలీస్ స్టేషన్ వరకు అంటే దాదాపు 6 కిలో మీటర్లు ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు ఎలాగైతే నిర్వహించామో అలాగే ప్రశాంతంగ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించే లక్ష్యంతో ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని తెలిపారు. అల్లర్లు, హింసాత్మక

మిగతా 2లో

# అరకొరా విత్తనాలు.. అన్నదాతల అపసోపాలు

(మొదటిపేజీ తరువాయి)

అందించాలో.. ఏ రైతుకు అందించకూడదో.. గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బందికి పంపిణీ తలకు మించిన భారంగా మారింది. పలువురు రైతులు, సిబ్బంది వ్యవసాయ శాఖ అధికారి దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోలేదని రైతులు మాట్లాడుకుంటున్నారు. రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాల్సిన వ్యవసాయ అధికారి రైతుల గోడు పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్ట అని రైతులు మండిపడుతున్నారు. ఇటీవల విత్తన పంపిణీ కేంద్రాల వద్దకు విత్తనాల కోసం రైతులు ఎగబడ్డారు. తీర కొంతమందికే విత్తనాలు పంపిణీ చేసి పలువురికి విత్తన నిల్వలు లేదని చెప్పడంతో ఉసూరుమని వెనుతిరిగారు. ప్రతి ఏటా వేరుశనగ రైతుల పట్ల వ్యవసాయ శాఖ అధికారి ఇదే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని రైతులు దుమ్మెత్తి పోస్తున్నారు. అధికారి తీరును ఎండగడుతున్నారు. ఇలాంటి అధికారులపై జిల్లా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వి.కోట రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారిపై కఠిన చర్యలు తీసుకొని సాగు రైతులందరికీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఎండోమెంట్ నిధులేమైనట్టు..?

(మొదటిపేజీ తరువాయి)

మునుపటిలా ఘనంగా నిర్వహించలేదనేది. నాయుడుపేట పట్టణ ప్రజల వాదన ఇక రాను... రాను... నిర్వహణ.. బాధ్యతలలో నల్లబోతుల నాగరత్నం కుటుంబీకులను పక్కనపెట్టి.. ఎవరికి పడితే వారికి అప్పగించడం. కమిటీ సభ్యులుగా... ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వాళ్ళ అనుకూలస్తులను మాత్రమే ఎంపిక చేసుకోవడం.. కొన్ని విమర్శలకు తావిస్తుంది. ఆలయ కమిటీకి సంబంధంలేని కొందరు వ్యక్తులు ఇక్కడ పెత్తనంచలాయించడం.. కమిటీలో ఉన్న కొందరికి జీర్ణించుకోలేని విషయం. ఘత రెండు సంవత్సరాల నుండి అంటే 2022-2023.లో కమిటీ మారిన తరువాత.. ఆలయ నిర్వహణ మరియు జాతర మహోత్స నిర్వహణ పూర్తిగా వ్యక్తిగతమైపోయిందనేదిభక్తుల ఆరోపణ.. ఈ కమిటీని ఎంపిక చేసిన సమయంలో.. నాగరత్నం కుటుంబీకులను పక్కనపెట్టి కమిటీలో కొత్త వ్యక్తులను చేర్చడంతో అప్పటినుండి వారిపై వ్యతిరేకతో ఏర్పడింది... అమ్మవారి సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని.. వ్యక్తిగతాలకు కూడా వాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి... 2023. సంవత్సరం.. జాతరలో విఐపి పాసులు అంటూ... వేల కొలది పాసులను ముద్రించి... అవి..విఐపిలతో పాటు అందరికి ఇచ్చేసి ... అమ్మవారి సొమ్మును వృధా చేయడమే కాకుండా సామాన్య భక్తులను సైతం ఇబ్బందికి గురిచేశారు. కమిటీ వారు. అంతేకాకుండా ఆలయ కమిటీ సభ్యులే. తమ బంధువులను తమకు తెలిసిన వారిని రూల్స్‌కి వ్యతిరేకంగా.. దగ్గరుండి దర్శనాలు చేయించడంతో సామాన్య భక్తులు అసహనానికి గురై నిర్వాహకులపై తిరగబడే స్థాయికి వెళ్ళింది వారి అసహనం. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చెక్కబెట్టారు. ఇక జాతర పేరిట ఈ రెండు సంవత్సరాలు భారీగా చందాలు వసూలు చేసి అమ్మవారికి జరగాల్సిన పూజలకు అభిషేకాలకు ఒక్కొక్క దాతను ఏర్పాటు చేసుకొని.వారి వద్ద నుండి భారీగా ముడుపులను వసూలు చేసి జాతరను మాత్రం తూ తూ మంత్రంగా నిర్వ హించి మమా అనిపించారు. జాతర నిర్వహణ కు.. చందాలే కాకుండా ఎండోమెంట్ కూడా.. నిర్వహణ బాధ్యతులు చూసుకుంటుంది. మరి వేచి చూద్దాం ఈసారి అమ్మవారి సొమ్ము... ఎంత మింగేస్తారో... ఎంత ధనం గల్లంతవుతుందో.. ఎన్ని ముక్కుపుటకలు.. చేతులు మారుతాయో ఇవన్నీభక్తులకు తెలియక పోవచ్చు మీడియా అనేది ఒకటుందని మర్చి పోవద్దు కమిటీ సభ్యులారా!!!

# ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు చేపడుతాం

(మొదటిపేజీ తరువాయి)

ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. అసాంఘిక కార్యకలాపాలు, సంఘ విద్రోహ చర్యలకు ప్రజలు పాల్పడద్దు. కౌంటింగ్ నేపథ్యంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నా, అల్లరి మూకలు విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో జిల్లా పోలీసులు సన్నద్ధత, దీటుగా ఉంటుందని ఇప్పటికే ఇలాంటి సమయంలో పోలీసుల స్పందన గురించి మాక్ డ్రిల్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

శాంతియుతంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీ వ్యక్తులు జిల్లా పోలీసులు యంత్రాంగానికి సహాయ సహకారాలు అందించాలి తెలిపారు.

# ఉచిత సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** అంతరించిపోతున్న ప్రాచీన సిద్ధ ఆయుర్వేదాన్ని తిరిగి ప్రజలకు అందించాలని సంకల్పంతో సేవా భరతి స్వచ్ఛంద సంస్థ, కేశవ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే కాలనీ సరస్వతి శిశు మందిర్‌లో ఉచిత సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఎముకల శాస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బాబు విచ్చేసి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ప్రారంభించి అల్లోపతి, ఆయుర్వద వైద్యం రెండు మానవునికి అవసరాన్ని బట్టి సమతు ల్యముగా పోతే అద్భుత ఫలితాలు సాధించ వచ్చునని చెప్పారు. గత నాలుగు నెలలుగా ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించు చున్న ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని ఆర్ఎస్ఎస్ తిరుపతి జిల్లా సహసేవ ప్రముఖ గంధవుడి ముని రత్నం అన్నారు. ఈ వైద్య శిబిరంలో 105 మంది పాల్గొని ఆయుర్వేద వైద్య సేవలు అందుకున్నారు. వచ్చే నెల చివరి ఆదివారం కూడా ఈ శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు జి మునిరత్నం తెలియజేశారు. కావున ప్రజలందరి అవకాశాన్ని ఉపయోగించుకొని వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ బౌద్ధిక ప్రముఖ టీ ధనుంజయ, కొండా రెడ్డి, డాక్టర్ ఎం సుందర మూర్తి, శరవణ, సుబ్బారెడ్డి, కొప్పరపు వెంకటేశ్వర్లు, ఎం రాజేంద్రన్, సుబ్బారెడ్డి, పద్మనాభం, కీర్తి వెంకయ్య పాల్గొన్నారు.



# సర్వమానవ సమానత్వాన్ని ప్రబోధించిన అన్నమయ్య

- డా. ఆకెళ్ల విభీషణ శర్మ



**తిరుపతి కల్చరల్, మేజర్‌న్యూస్:** అన్నమాచార్యులు తన సంకీర్తనల్లో సర్వమానవ సమానత్వాన్ని ప్రబోధించారని అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాఎ ఆకెళ్ల విభీషణ శర్మ పేర్కొన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహిస్తున్న సాహితీ సదస్సులు ఆదివారం మూడవ రోజుకు చేరుకున్నాయి. సదస్సుకు అధ్యక్షత వహించిన డా ఆకెళ్ల విభీషణ శర్మ "అన్నమయ్య యోగ సంకీర్తనలు " అనే అంశంపై ఉపన్యసిస్తూ, ప్రసిద్ధ శ్రీవైష్ణవాచార్యులు భగవద్ రామానుజులు తెలియజేసిన అష్టాక్షరి మంత్రాన్ని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా శ్రీ వైష్ణవ ధర్మాన్ని, భక్తి తత్వాన్ని ప్రచారం చేసినట్టు తెలిపారు. అన్నమయ్య యోగ సంకీర్తనల ద్వారా ధర్మ, భక్తి, శరణాగతి, అహింస ప్రధానంగా ఉన్నాయన్నారు. హింసకు దూరంగా ఉండి భగవంతునిపై పూర్తి విశ్వాసంతో నామసంకీర్తనం చేస్తే ముక్తి కలుగుతుందని అన్నమయ్య కీర్తనల ద్వారా అవగతమవుతుందని వివరించారు. ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు డా. సర్వోత్తమరావు "అన్నమయ్య - శ్రీనివాసుని అభిషేక సంకీర్తనలు" అనే అంశంపై ఉపన్యసిస్తూ, తిరుమల వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగే అభిషేకము శుక్రవారం నాడే ఎందుకు జరుపుతారో తెలియజేసినారు. తిరుపతికి చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త గౌరిపెద్ది వేంకట శంకర భగవాన్ "అన్నమయ్య సంకీర్తనలు - భగవద్గీతా ప్రభావం" అనే అంశంపై మాట్లాడారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన కుమారి లలిత, హయగ్రీవ నారాయణాచార్యులు బృందం గాత్ర సంగీతం, రాత్రి 7 గంటలకు హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస శర్మ బృందం సంగీత సభ నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## రేణుక మాత పరమేశ్వరీ ఆలయంలో అగ్నిగుండ ప్రవేశం

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మేజర్ పంచాయతీ సుద్ధగుంట గ్రామంలో వెలసిన ఆదిపరాశక్తి రేణుక మాత తిరుణాల సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద రేణుకమ్మ విశ్వరూపాన్ని ముగ్గు వేయడం రాత్రి ఆలయం వద్ద అగ్నిగుండ ప్రవేశం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలుగా వెంకటరమణ కుటుంబ సభ్యులు నిర్వహించారు అనంతరం అమ్మవారు పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులిచి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## నైనేరమ్మ ఆలయంలో మండల పూజ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:**



కార్వేటినగరం మండలం డి.ఎం.పురం పంచాయతీ దేరా కండిగా గ్రామం నైనేరమ్మ గుంట వద్ద వెలసిన నైనేరమ్మ ఆలయంలో మండల పూజా సందర్భంగా ఆలయంలో ఆది వారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమం పూర్ణాహుతి, అమ్మవారి పొంగల్ పేట్టి నైవేద్యం సమర్పించి అన్నదాన కార్యక్రమం, ఆలయం వద్ద గురువులకు, తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద సంగీతం నిర్వహించి ఉత్సవమూర్తులను పురవీధులు ఊరేగించారు. భక్తులు కర్పూర ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆనందుడు, బొజ్జా రెడ్డి, గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి సందర్శనార్థం క్యూలైనులో ఉన్న పలువురు భక్తులకు ఆదివారం ఆలయ ఈవో ఎ. వెంకటేశు చేతుల మీదగా మజ్జిగ,మంచి నీళ్ళు పంపిణీ చేశారు. స్వామి వారి సందర్శ నర్థం మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తెలంగాణా వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధ్యం భక్తులు తరలి రావడం నువాయితిగా మారింది. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించడం చేత ప్రతి రోజు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. అందులో భాగంగానే ఆదివారం ఉదయం నుంచే స్వామి వారి సందర్శనార్థం క్యూలైనులో భక్తులు స్వామి వారి సందర్శ నర్థం బారులు తీరారు. స్వామివారి ఆలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ, ఆదివారము, సంకటహర చతుర్థి, వేసవి సెలవు,స్వామివారి సందర్భంగా స్వామివారి దర్శనార్థమై ఆలయ క్యూ లైన్‌లో పోటెత్తిన భక్తులు రద్దీ భారీగా పెరిగింది. ఉచిత దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టుతుంది. వేసవి దృష్ట్యా భక్తులుకు దేవస్థానం వారు మజ్జిగ, మంచి నీరు సౌకర్యార్థం కల్పించారు. ఈమేరకు క్యూ లైన్‌లో మంచినీరు, మజ్జిగ పంపిణీ, అధిక రద్దీ సందర్భంగా భక్తులకు ఆలయం వెలుపల మజ్జిగ పంపిణీ ఈ.వో వెంకటేశు చేతులు మీదుగా పంపిణీ చేశారు.

## బోయకొండ గంగమ్మ దేవస్తానంలో అన్నదానానికి రూ.5 లక్షల విరాళం



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో జరిగే నిత్యన్నదానానికి తిరుపతికి చెందిన బాలాజీ అమ్మవారిని దర్శుచుకుని, నిత్యన్నదానంకు రూ. ఐదులక్షల చెక్కును కార్యనిర్వాహణాధికారి చంద్రమౌళి, చైర్మన్ నాగరాజ రెడ్డిలకు అందజేశారు. ఈ సందర్బముగా చైర్మన్ నాగరాజ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు దేవస్థానం వారు అన్నదానం చేస్తున్నట్లు,భక్తులు ఎవరైనా అన్నదానానికి విరాళాలు ఇవ్వదలచినవారు.ఎవరైనా మా కార్యాలయంలో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

# భక్తులకు నిత్యం అన్నదానం : ప్రతాప్ స్వామీజీ

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయమైన అప్పలాయ గుంటలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రతిరోజు రోజురోజుకు భక్తులు సంఖ్య పెరుగుతున్నారు. అయితే స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఆకలితో తిరిగి వెళ్ళకుండా ఉండాలని ఆకాంక్షతో ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పూజ శ్రీ ప్రతాప్ స్వామీజీ ఆరు నెలలుగా ముందుకు ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం ప్రతిరోజు మధ్యాహ్నం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహిస్తున్నారు అన్నారు. సాధారణ రోజుల్లో రోజుకు 300 మంది భక్తులకు అన్నదానం స్వీకరించగా, శనివారం రోజు మాత్రం భక్తుల రద్దీ సుమారు 800 మంది కి రుచికరమైన అన్నదాన కార్యక్రమం స్వీకరిస్తామన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు తిరుపతి పరిసర ప్రాంతాల నుండే కాకుండా తమిళనాడు కర్ణాటక నుండి అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనానికి విచ్చేస్తున్నారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులు తిరిగి ఇంటికి వెళ్లాలంటే చాలా సమయం పడుతుందని భక్తులందరూ ఆకలితో వెళ్లకుండా ఉండాలని ఉద్దేశంతో ఆలయ ప్రాంగణంలో ప్రతి రోజు నిత్యం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రతాప్ స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కార్యకర్తలు అభిమానులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## తనయుడి జ్ఞాపకార్థంగా టోర్నమెంట్ పోటీలు ప్రారంభం



**వాకాడు, మేజర్‌న్యూస్:**

వాకాడు మండల పరిధిలోని పూడి రాయి దొరువు గ్రామం లో మాజీ సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి కుమారుడు నవీన్ రెండవ వర్ధంతి సందర్భంగా ఆదివారం నవీన్ జ్ఞాపకార్థంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ప్రథమ బహుమతి కింద 15 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి కింద పదివేలు, తృతీయ బహుమతి కింద 7 వేలు రూపాయలు, నాలుగవ బహుమతి కింద 5 వేలు రూపాయలు అందజేయడం జరుగుతుంది. గ్రామీణ యువకుల్లో క్రీడాశక్తిని పెంపొందించేందుకు రాజగోపాల్ రెడ్డి తనయుడు నవీన్ జ్ఞాపకార్థంగా టోర్నమెంట్ కబడ్డీ పోటీలు నిర్వహించారు.

## ప్రీమియర్ లీగ్ క్రికెట్ సంబరాలు

**పలమనేరు, మేజర్‌న్యూస్:** మదర్ తెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ సంబరాలు ఘనంగా ముగిసాయి. విద్యార్థులతో క్రీడా స్ఫూర్తిని నింపడానికి మదర్ తెరిసా విద్యాసంస్థలుముందంజలో ఉంటాయని కరస్పాండెంట్ డాక్టర్ ఎం.రవీంద్రబాబు తెలిపారు. చైర్మన్ ఎంఆర్ సునీల్ మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు సమయ స్ఫూర్తిని నింపడానికి క్రీడలు ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమని అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. జిఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజ్ మదనపల్లె గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ రాయచోటి జట్ల మధ్య ఫైనల్ జరగక ప్రభుత్వ పాలిటెక్నిక్ రాయచోటి జట్టు విజయం సాధించింది. గెలుపు సాధించిన మొదటిజట్టుకు 29వేలు రెండవ జట్టుకు 15వేలు బహుమతులు ప్రధానం చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీకాంతరెడ్డితెలిపారు. ఈ క్రికెట్ సంబరాల్లోచిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల నుంచి 20 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు కృష్ణారెడ్డి, లోకేష్ తోపాటు కళాశాల సిబ్బంది ఘనంగా నిర్వహించారు.



# చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలి

**కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 మే 13వ తేదీన జరిగిన ఎన్నికలలో ఉమ్మడి పార్టీలు అత్యధిక మెజార్టీని సాధించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆదివారం తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం ఆలయంలో జిల్లా టీడీపీ పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేశ్ యాదవ్, చిత్తూరు రూరల్ మండలం పార్టీ అధ్యక్షులు శశికర్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలన్న, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్న నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర పార్టీ ఉపాధ్యక్షులు బాబు రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ ఎస్సీ సెల్ కార్యదర్శి కందస్వామి తదితరులు పాల్గొన్నారు.





## 6 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం

**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** రాపూరు సమీపంలోని మళ్లమ్మకోన బాట వద్ద ఆరు ఎర్రచందనం దుంగలతో పాటు ఒక కారును టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆదేశాలు మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ ఎస్ఐ టీ. విష్ణువర్ధన్ కుమార్ అటవీశాఖ అధికారులు వై. మస్తాన్, ఎం. ప్రవీణ్ కుమార్, మల్లమ్మకోన ఫారెస్ట్ బీటు వాచర్లు, స్ట్రైకింగ్ ఫోర్స్ ప్రొటెక్షన్ వాచర్ల సహకారంతో రాపూరు రేంజి గోసూపల్లి సెక్షన్, మల్లమ్మకోన బాట వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో అనుమానాస్పదంగా కారు కనిపించింది. అందులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేయడాన్ని గమనించారు. దీంతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. అయితే స్మగ్లర్లు అక్కడ నుంచి పారిపోయారు. ఆ ప్రాంతంలో ఆరు ఎర్రచందనం దుంగలు, కారు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ జి. శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సంకల్ప వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** వినాయక సాగర్ వద్దనున్న సంకల్ప వరసిద్ధి వినాయక స్వామికి సంకటహర చతుర్దశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. విఘ్నాలను తొలగించే గణపతికి అత్యంత ప్రీతిపాత్రమైన తిధులలో ప్రధానమైనది చవితి తిధిఅని, రెండోది సంకష్టహర చతుర్ధి పౌర్ణమి తరువాత 4వ రోజు వచ్చే చతుర్ధి రోజున చేసే వ్రతంను సంకష్టహర చతుర్ధి లేదా సంకటహర చతుర్ధి వ్రతం అంటారని గుండాల గోపీనాథ్ రెడ్డి తెలియజేశారు. సంకటములను తొలించే సంకట హర చతుర్ధి రోజున వినాయక స్వామికి పూజలు నిర్వహించడం వలన అన్ని శుభాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితుడు సురేష్ స్వామి, ఆలయ ధర్మకర్త కొండే చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపీనాథ్ తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, డిపి ఆనంద్ వాసు, రాజశేఖర్ రెడ్డి, విజయలక్ష్మి, శాంతి వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.



# కార్డెన్ సర్చ్, నాకాబందిలో ఈస్ట్ పోలీస్ స్టేషన్ తొలి అడుగు

- స్కావెంజర్ కాలనీలో ప్రతి ఇల్లు సోదా
- రికార్డులు లేని 30 వాహనాలు సీజ్
- జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలు
- డి.ఎస్.పి ఉత్తర్వులు మేరకు
- రంగంలోకి దిగిన ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, అలిపిరి సీఐ రామారావు, ఎస్సైలు గజాల పురుషోత్తం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బాలకృష్ణ, 50 మంది పోలీస్ సిబ్బంది



**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ఎస్పీలు అప్రమత్తమయ్యారు. ముందస్తు కౌంటింగ్ రోజున కౌంటింగ్ ప్రదేశాల్లో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆయా జిల్లాల ఎస్పీల ఆదేశాల మేరకు ఆయా పోలీస్ స్టేషన్ల డిఎస్పీలు సిఐలు ఎస్సైలు పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగారు. ఆదివారం తిరుపతి జిల్లాలో ముమ్మరంగా కార్డెన్ సర్చ్, నాకాబంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంట్లో భాగంగా ఆదివారం ఉదయం ఈస్ట్ పోలీస్ స్టేషన్ డిఎస్పి ఉత్తర్వుల మేరకు ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి అలిపిరి సిఐ రామారావు లు ఎస్సైలు గజాల పురుషోత్తం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి బాలకృష్ణ, 50 మంది పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగారు. మొదటగా స్థానిక స్కావెంజర్ కాలనీలో ప్రతి ఇల్లు సోదా చేశారు. రికార్డులు లేని 30 వాహనాలను సీజ్ చేశారు. ఆయా వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు వాహన యజమానులు చూపెడితే వాహనాలను రిలీజ్ చేస్తామని, లేనిపక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ సిఐ మహేశ్వర్ రెడ్డి అలిపిరి సిఐ రామారావులు స్పష్టం చేశారు. అంతేకాకుండా గొడవలు చేయడం వల్ల కలిగే నష్టాలను, అంతేకాకుండా వారిపై పెట్టే క్రిమినల్ కేసుల వివరాలను గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.



**సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్...**

ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా నిలువరించాలనే ముఖ్య ఉద్దేశంతో ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో సుబ్బయ్య గుంట, కుమ్మరపల్లి, ఆర్.మల్లవరం, కృష్ణాపురం తదితర సమస్యాత్మక గ్రామాల్లో, గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో గాజుల మండ్యం గ్రామం, అత్తూరు, అల్లి కశం సమస్యాత్మక గ్రామాలలో స్థానికులతో సమావేశమై జూన్ 4 వ తేదీ వరకు ఎలక్షన్ కోడ్‌తో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట అర్బన్, గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, సిఐ ఎస్ ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

## ఆరణి శ్రీనివాసులకు ఏదైనా జరిగితే భూమన కుటంబానిదే బాధ్యత

**- అరిగల వేణుగోపాల్ కాపు సంక్షేమ సంఘం**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్ధి ఆరణి శ్రీనివాసులకు ఏదైనా జరిగితే ఎమ్మెల్యే భూమన కుంటుంభానిదే బాధ్యతని కాపు సంక్షేమ సేన శ్రీకాళహస్తి ఇంచార్జ్ అరిగిల వేణుగోపాల్ ఆరోపించారు. తిరుపతి ప్రజలు ఆరణి శ్రీనివాసులకు పట్టడం ఖాయమని తేలడంతో ఓర్వలేక కౌంటింగ్ సందర్భంగా గొడవలు చేసేందుకు భూమన కుటుంభం కుట్ర పన్నినట్లు తెలిసిందని ఆయన ఓ పత్రికా ప్రకటనలో విమర్శించారు. ప్రజల మనిషిగా చిత్తూరులో గన్ మెన్ అవసరం లేకుండా తిరిగిన ఆరణి శ్రీనివాసులు తిరుపతిలో పోలీసు భద్రత మధ్య తిరిగే పరిస్థితి తలెత్తడం వెనక భూమన కుటుంబం కుట్రలే కారణమని ఆయన అన్నారు. గ్రేటర్ రాయలసీమలో జనసేన తరుపున పోటీచేసిన ఏకైక బలిజ ఎమ్మెల్యే అభ్యర్ధి ఆరణి శ్రీనివాసులకు ఏదైనా జరిగితే భూమన కుటుంభం బలిజ సామాజిక వర్గం యొక్క సత్తా ఏంటో చూస్తుందని ఆయన హెచ్చరించారు.

# అట్టహాసంగా ప్రారంభమైన పోలేరమ్మ జాతర ఘట్టం

**నాయుడుపేట మేజర్ న్యూస్:** నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతర ఆదివారం ఉదయం పెద్ద కాపు ఆరవభూమి. శ్రీనివాసులు రెడ్డి, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శాంశంక్, గ్రామ సంప్రదాయ పెద్దలు రాగి శేషగిరి, ఆకుల కుబేర మణి, నల్లబోతుల రామారావు ఆధ్వర్యంలో గడియారం స్తంభం వద్ద ఉన్న పోలేరమ్మ గుడి వద్ద సంప్రదాయ పద్ధతిలో ఘట్టం కార్యక్రమం మొదలయింది. పెద్ద కాపు అరవభూమి. శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో విన్నమాల గ్రామస్తులతో కలిసి దున్నపోతు తో పాటు అమ్మవారి దేవాలయం వద్ద కు చేరుకొన్నారు. ఆలయ అర్చకులు సురేష్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సంప్రదాయ ప్రకారం వంశపారంపర్యంగా వస్తున్న చాకలి, కుమ్మరి లు ఘట్టం కుండ తో పాటు దున్నపోతు తో కలిసి పట్టణం లో ఇంటికి ఇంటికి తిరిగి అమ్మవారి పూజలు అందుకొన్నారు. రెండు రోజుల పాటు పట్టణంలో ఈ ఘట్టం విధికీ విధికి తిరుగుతారు. మంగళ వారం రాత్రి స్థానిక బజరువీధి లోని అమృతమ్మ నివాసం వద్ద కుమ్మరి చేసిన అమ్మవారి విగ్రహం తో ఊరేగింపు ప్రారంభం అవుతుంది. బుధవారం ఉదయం అమ్మవారు స్థానిక గడియారం వద్ద ఉన్న గుడి వద్ద కొలువు అవుతుంది. కన్నుల పండుగగా నిర్వహించే పోలేరమ్మ జాతర ఈ సంవత్సరం ఎన్నికల కోడ్ ఉండడంతో ఈ సంవత్సరం ఎలా నిర్వహిస్తారని స్థానికులు చర్చించుకుంటున్నారు.







## తిరుమల టీడీపీ నాయకులతో సమావేశం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** తిరుమల టీడీపీ నాయకుల సమావేశం ఆదివారం తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో వారి సమావేశం నిర్వహించి సార్వత్రిక ఎన్నికలు ఎలా జరిగాయో నాయకులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన ఎన్నికల్లో పై తిరుమల అధ్యక్షుడు రాజు యాదవ్ సుగుణమ్మకు వివరించారు. ఎన్ డి ఏ కూటమి ఉమ్మడి అభ్యర్ధులకు తిరుమల నుంచి భారీ మెజారిటీ రావడం ఖాయమని తెలియజేశారు. పోలింగ్ రోజున నాయకులందరూ సమిష్టిగా కృషి చేశారన్నారు. ఎన్నికల్లో విజయం తధ్యమని, తిరుమల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తిరుమల టిడిపి అధ్యక్షులు రాజు యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి శివశన్మగం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



దారి లేక ఇబ్బంది పడుతున్న భక్తులు

# దేవస్థానం సీఆర్వోకు దారెటు!

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వారు ఏదో ఘనకార్యం చేసినట్లుగా పరిపాలన భవనంలో ఉండిన సీఆర్వో ను వసతి గదిలిచ్చే కార్యాలయం షాపింగ్ కాంప్లెక్స్ లోకి మార్చారు. అయితే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు. సీఆర్వో అక్కడ ఉన్నట్లు ఎటువంటి సూచిక బోర్డులు లేవు. కొందరు వ్యాపారులు దారిని కూడా ఆక్రమించేశారు. ఎటు వెళ్ళాలో భక్తులకు తెలియడం లేదు. ఎన్ని అతిథి గృహాలున్నాయి. ఎన్ని గదులు ఉన్నాయి. ఒక్కో గదికి ఎంత ధర అనే వివరాలు తెలిపే బోర్డులు అసలు కనిపించవు. ఎన్ని గదులు ఖాళీగా ఉన్నాయి. అక్కడికి వెళ్లడానికి ఎటువంటి సౌకర్యం అందజేస్తున్నారు ఆ వివరాలు లేవు. సీఆర్వో లో సమాధానం చెప్పకుంటే, ఎక్కువ మొత్తం తీసుకుంటే. ఏదైనా సమస్య వస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలనే విషయాలు ఎక్కడా కనిపించడం లేదు. అసలు సీఆర్వో ను భక్తులకు కనిపించకుండా ఏర్పాటు చేశారు. ఏదైనా ఒక కార్యక్రమం తలపెడితే అందుకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలి. మొక్కుబడిగా చేయడం. అవగాహన లేకుండా అమలు చేయడం. భక్తుల ఇబ్బందులను పట్టించుకోక పోవడం అధికారులకు షరా మామూలుగా మారింది. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు సీఆర్ఓ ఆఫీస్ కి దారి కల్పించే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

# వైభవంగా కాణిపాకంలో సంకట హర గణపతి వ్రతం

**- ఆలయ ఈవో వెంకటేశులు**

**ఐరాల, మేజర్‌న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అత్యంత వైభవంగా ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా స్వామి వారి ఆస్థాన మండపంలో నిర్వహించిన సంక టహర గణపతి వ్రతంలో పలువురు భక్తులు పూజలు చేసి ముక్కు బడులు తీర్సు కున్నారని, ఆలయ ఈవో ఎ. వెంకటేశులు తెలిపారు. అలాగే సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు బంగారు రథోత్సవం,ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, స్థానికులు పాల్గొని పూజలు నిర్వహించుకున్నారన్నారు.

ఒక్కటికెట్ ధర 350 రూపాయలు ఒక్కటికెట్‌కు ఒకరు అనుమతి అని వారు స్పష్టంచేశారు. సంకటహర చతుర్థి ప్రతి నెల పూర్ణమి తరు వాత వచ్చే చవితి రోజున భక్తులు సౌకర్యార్థం సంకట హర గణ పతి వ్రతం నిర్వహించడం అనువాయితిగా మారింది. అందులో 1.సంకట అనగా కష్టములు, 2.హర అనగా నసింప చేయు నది, 3. చతుర్థి అనగా,4 వ తిథి విఘ్నములకు అధిపతి అయిన గణపతికి ప్రీతీకారమైన తిథి కావున పర్వదినాన్ని పురష్కరిం చుకొని విద్య, ఉద్యోగం, వ్యాపారం,వివాహం,ఆరోగ్యం తదితర విషయాలలో కల్గునటువంటి ఒడిదుడుకులను అధికమించటకు ఈసంకట హర గణపతి చతుర్థి వ్రతమును పురాణంలో మహర్షులు తెలియజేసి యున్నారని వారు తెలిపారు. అటువంటి ఈవ్రతాన్ని వినాయకుడే స్వయంగా వెలిసిన కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి సన్నిధిలో చేసుకొంటే విద్యార్థులకు విద్య, ధనార్థులకు ధనము, పుత్రార్థులకు పుత్రులు, మోక్షాదులకు మోక్షము,వ్యాపారిస్టులకు వ్యాపారం, ఉద్యోగ సమస్య ఉద్యోగం వంటి రెట్టింపు ఫలితములు కల్గును.కాబట్టి యావన్మాది భక్తాదులందురూ కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి సన్ని ధినందు ఆస్థాన మండపంలో నిర్వహించిన సంకట హర చతుర్థి పర్వదిన్నాన్ని పురష్కరించుకొని సంకట హర గణపతి వ్రతం పూజా కార్యక్రమంలో పలువు భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాకల్గారని ఆలయ ఈవో ఎ. వెంకటేశులు తెలిపారు.



# రాష్ట్ర ముఖ్య కార్య నిర్వహణ అధికారి వ్యవహార శైలిపై చర్యలు చేపట్టాలి

**- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటిల సురేంద్ర కుమార్**

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** రాష్ట్ర ముఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వ్యవహార శైలిపై ప్రత్యేక దర్యాప్తు చేయించాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటిల సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చిత్తూరు టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి ఒక అత్యంత బాధ్యతాయుతమైనదని ఉన్నత స్థాయిలో ఉన్న సిఏస్ జవహార్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం చాలా దారుణమని విమర్శించారు. గత రెండు రోజులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పై అసైన్డ్ భూములు వ్యవహారముకు సంబంధించి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొనడం, అనేక పత్రికలలో ఈ వార్తలు రావడం చూసాం,. రాష్ట్ర చీఫ్ సెక్రటరీపై తీవ్ర ఆరోపణలు రావడంపై రాష్ట్ర గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని వీటిపై సిబిఐతో గాని, హైకోర్టు సిటింగ్ న్యాయమూర్తితో గాని, కేంద్ర హోంశాఖ కూడా రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ ద్వారా వ్యవహార శైలపై సిటింగ్ సిబిఐతో విచారణ జరిపిం చాలని, వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావాలని డిమాండ్ చేయడం చేశారు. రాష్ట్ర పరిపాలనలో చీఫ్ సెక్రటరీ కీలక బాధ్యతలు నిర్వహిస్తా రని, రాష్ట్ర ఉద్యోగులందరికీ రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా పనిచేయించే బాధ్యత, అధికారం రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డిపై ఉందని, కాగా సీజే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అను కూ లంగా, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నరని ఆరోపణలు రావడం జరుగు తున్నది. ముఖ్యమంత్రి సంతృప్తి పరిచే విధంగా చీఫ్ సెక్రటరీ పని తీరు ఉంది తప్ప రాష్ట్రాన్ని నిష్పక్షపాతంగా పరిపాలన, బాధ్యతలు నిర్వించే పరిస్థితులు కనబడడం లేదని, రాష్ట్రం నిబంధనలు పక్కన పెట్టి వైకాపా ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడం జరిగింది ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారులు ఏకపక్షంగా వ్యవ హరిస్తూ ఉన్నా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ యే మాత్రం వాటి పైన స్పందించలేదన్నారు. పోలింగ్ రోజు నాడు పోలింగ్ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై స్పందన లేదు. రాష్ట్రం లో అనేక నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు పై పోలింగ్ ఏజెంట్లు పై చివరికి టిడిపి కి ఓటు వేసిన ప్రజలపై కూడా దాడులు చేస్తూ హింసించడం జరుగుతున్నా చీఫ్ సెక్రటరీ వీటిపై తీవ్రంగా స్పందించ లేదన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా పోలీస్ ఎస్పీలు డి.ఎస్.పి ల బదిలీల యొక్క లిస్టును పంపినప్పటికీ చీఫ్ సెక్రటరీ అందులో కూడా వైకాపా పార్టీకి అనుకూలంగా ఉన్నటువంటి పోలీస్ అధికారుల పేర్లను ను సిఫార్స్ చేయడం జరిగిందన్నారు. పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో వాలంటరీ ద్వారా నగదు పంపిణీ చేయరాదని, సచివాలయంలో ఇతర ఉద్యోగులు, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయమని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే అందుకు భిన్నంగా పెన్షన్ దారుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు చేపట్టారని అన్నారు.




మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటీల సురేంద్ర కుమార్

# వైభవంగా మూసిన మాతమ్మ అగ్నిగుండ ప్రవేశం



**కార్వేటి నగరం మేజర్ న్యూస్:** మండలంలోని సుద్ధగుంట, తూర్పు అరుంధతివాడ, కేఎం పురం పంచాయతీలో ఉన్న అరుంధతి వాడలో వైభవంగా మాతమ్మ తిరునాళ్లు వైభవంగా నిర్వహించారు గ్రామంలో వెలసిన ఆదిపరాశక్తి రేణుక మాత తిరుణాల సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద రేణుకమ్మ విశ్వరూపాన్ని ముగ్గు వేయడం రాత్రి ఆలయం వద్ద అగ్నిగుండ ప్రవేశం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలుగా వెంకటరమణ కుటుంబ సభ్యులు నిర్వహించారు అనంతరం అమ్మవారు పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులిచి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# నగరంలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు

**తిరుపతి క్రైమ్, మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆదివారం ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ వాహనాల తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా సమస్యాతక ప్రాంతాల్లో డి.ఎస్.పి ఉత్తర్వుల మేరకు సంబంధిత పోలీస్ స్టేషన్లో సిఐలు ఎస్సైలు పోలీస్ సిబ్బంది ఆ తనిఖీల్లో పాల్గొంటున్నారు.తిరుపతి రూరల్ పరిధిలో పలు సర్కిల్‌ల వద్ద వాహనాల సోదాలు జరుగుతున్నాయి. కార్లు, ఆటోలు ,ద్విచక్ర వాహనాల తనిఖీతో పాటు రికార్డులను కూడా పరిశీలించారు.తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ ఎస్సై నాగేంద్రబాబు ఆధ్వర్యంలో స్పెషల్ ఫోర్స్ సిబ్బందితో తనిఖీలు కొనసాగాయి.



# గూడూరులో రాయి చెస్ అకాడమీ

**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** గూడూరు కుమ్మరి వీధిలో నెల్లూరు రాయి చెస్ అకాడమీ బ్రాంచ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు చదరంగ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గూడూరు చేస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేంద్రనాథ్ చౌదరి. నేషనల్ వుమెన్ చాంపియన్ మంజుల నేషనల్ ప్లేయర్ ఆనంద్ నాయక్ పాల్గొన్నారు. చదరంగ పోటీలు రాయ్ చేస్ అకాడమీ ఫౌండర్ షేక్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో జరిగాయి. షేక్‌షరీఫా ఆధ్వర్యంలో చేస్ అకాడమీ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు .విజేతలు 1. మేకల కార్తీక్.2. నై మీష్ 3. వర్ధన్ విజేతలుగా నిలిచారు. ఈ సదరంగ పోటీలలో పోటీలలో 59మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



## 28 నుండి శ్రీ వేణుగోపాల్ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం లో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో28 నుండి జూన్ 6 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. 28న సాయంత్రం 5 గంటల నుంచి8 గంటల వరకు సైన్యాధిపతి తిరు వీధి ఉత్సవం, 29 ఉదయం ధ్వజారోహం, సాయంత్రం పెద్ద శేష వాహనం, 30 న ఉదయం చిన్న శేష వాహం, సాయంత్రం హంస వాహనం,31న సింహ వాహనం, రాత్రి ముత్యపు పంది వాహనం,1న ఉదయం కల్పవృక్ష వాహనం, హనుమంతు జయంతి, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రికి సర్వభూపాల వాహనం, 2న ఉదయం మోహిని అవతారం, రాత్రికి గరుడ వాహనం,3న ఉదయం హనుమంత వాహనం, వసంతోత్సవం, సాయంత్రం గజవాహనం,4న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రికి చంద్ర ప్రభ వాహనం,5న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనం, 6న ఉదయం పల్లకి ఉత్సవం, స్నాపన తిరుమంజనం, చక్రస్థానం, సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరు విజయవంతం చేయాలన్నారు.

## హరికృష్ణా రెడ్డి చిత్ర పటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి

**- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా ఛైర్మెన్ మోహిత్ రెడ్డి**



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** పాకాల మండలం సామిరెడ్డి పల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ హరికృష్ణా రెడ్డి ఈనెల 18వ తేదీ ఆకస్మికంగా మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం సామిరెడ్డి పల్లిలో నివాసం వద్ద ఆయన దశ దిన కర్మక్రియలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఆయన కుమారుడు తుడా ఛైర్మెన్, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు హాజరై చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని ఓదార్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నాయకుడిగా హరికృష్ణా రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. చెవిరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని హరికృష్ణ రెడ్డి చిత్ర పటానికి అంజలి ఘటించారు.

## వైభవంగా ధర్మరాజుల ఆలయంలో అగ్నిగుండ ప్రవేశం

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటినగరం మండలం కత్తిరి పల్లి పంచాయతీలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు . మధ్యాహ్నం ఆలయం దుర్యోధన దుశ్యాసన వధ యుద్ధఘట్టని నిర్వహించారు. మల్లయ్య మాజీ సైనికుడు నిర్వహించారు. హరికథ ఉభదాతలు అరంవారీ ఇండ్లు నిర్వహించారు, కత్తిరిపల్లి గ్రామానికి చెందిన 80 వేల రూపాయలు విలువ చేసే కవచని రజిని శీనురెడ్డి వారి కుటుంబ సభ్యులు ఆలయానికి అందజేశారు. రాత్రి వైభవంగా కంకణకరించినవారు అగ్నిగుండ ద్రౌపది అమ్మవారికి బడిబాల్లో అగ్ని కట్టి తర్వాత ప్రవేశం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలుగా దాసరి కులస్తులు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ధనగిరి రెడ్డి, బాబు రెడ్డి, మహిళలు భక్తులు ఉభయ దాతలు పాల్గొన్నారు.



## మరో సారి వైసీపీ విజయం తథ్యం - జిల్లా యూత్ అధ్యక్షులు హేమంత్ రెడ్డి

**తిరుపతిరెవెన్యూ మేజర్‌న్యూస్:** ముఖ్య మంత్రిగా మరో సారి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి పట్టం కట్టే విధంగా వచ్చే నెల 4న నిర్వ హించే ఓట్ల లెక్కింపులో ఓటర్ల తీర్పు ఉంటుం దని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ జన విభాగం జిల్లా అధ్యక్షులు హేమంత్ రెడ్డి తెలి పారు. ఆదివారం ఆయన విలేకరులతో సమా వేశంలో మాట్లాడుతూ విశాఖ వేదికగా జూన్ 9న మళ్ళీ సీయంగా జగన్ మోహన్ రెడ్డి చేయబోయే ప్రమాణస్వీకార మోహొత్సవా నికి రాష్ట్ర ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో 120 మంది పైగా ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకుని వైకాపా విజయభేరీ మోగిస్తుందని ధీమా వ్యక్తం చే శారు. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి జగనన్న విద్యాదీ వెన, ఫీజు రీయింబర్స్ మెంట్, వైయస్ఆర్ ఆసరా, వైయస్ఆర్ చేయూత, రైతులకు ఇన్



పుట్ సబ్సిడీలను డీబీటి ద్వారా నేరుగా సీయం జగన్ కోట్లాది రూపాయల మేర నిధు లు లబ్దిదారులకు జమ చేయించారని అన్నా రు. సామాన్య ప్రజల కష్టాలు, ప్రజా సంక్షే మం తెలిసిన జగన్ మోహన్ రెడ్డి నాయక త్వం రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని స్థానాలలో వైసీపీ విజయం సాధిస్తుందని, కుప్పంలో చంద్రబాబు కూడా ఓడిపోతున్నారని అన్నారు. టిడిపి,జనసేన కూటమి దుష్ప్రచా రం, కుయుక్తులపైన నమ్మకం పెట్టుకుందని మండిపడ్డారు. రాష్ట్రంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుస్తున్నప్పటికీ, టీడీపీ జూదగాళ్లు మాత్రం కొత్త డ్రామాకు తెర తీశారని హేమంత్ రెడ్డి అన్నారు. కూటమి గెలవబో తోందంటూ చోటా మోటా నాయకులకు ఆశలు కల్పించి వారితో అప్పులు చేయించి మరీ పందేలు కట్టిస్తున్నారని, మరో వైపు ఓడిపోతున్న ఆ పార్టీ అభ్యర్థులు వైయస్ఆర్ సీపీ తరపున పందేలు కడుతున్నారని అన్నారు. టీడీపీ నాయకుల మాటలు నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని, కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టొద్దని టీడీపీ కార్యకర్తలకు హితవు పలికారు.

## బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ కమిటీ ఎంపిక

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రైవేటు హొటల్లో ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం, ఎన్నికలు నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల ప్రతినిధులైన అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలకు మస్కట్ దేశం నుంచి విచ్చేసిన షకీల్ నలాకట్ పరిశీలకుడుగా వ్యవహరిస్తూ ఫెడరే షన్ జాతీయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడుగా డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ (ఆంధ్రప్రదేశ్) ప్రధాన కార్యదర్శిగా విజి.బాబు(కేరక), కోశాధికారిగా జైకుమార్ (కేరళ), ఉపాధ్యక్షులుగా తస్వీనర్ ఖాన్(ఉత్తరప్రదేశ్, అనైసోని (మహారాష్ట్ర), టి.శేఖర్, షకీల్, సహాయ కార్యదర్శులుగా పంకజ్ త్యాగి (ఉత్తరప్రదేశ్), వినోద్ (బెంగాల్), మహేష్ శర్మ(రాజస్థాన్). యూనిస్‌బాషా (ఆంధ్రప్రదేశ్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జోష్, పల్యూష( కర్ణాటక), సురేష్ శర్మ(మధ్యప్రదేశ్), సతీష్(పాండిచ్చేరి). శేఖర్ (హర్యానా), అసోసియేట్ కార్యదర్శిగా అనురాగ్ చౌదరి (ఉత్తరకాండ్), చీఫ్ క్యాపిటర్గా సుభాష్ బదనా (డిల్లీ), ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా యోగేష్ (నాగపూర్), ఇర్ఫాన్



(కెరళ), గౌరీ శంకర్(ఒరిస్సా), ప్యాట్రన్గా ఈశ్వర్ ప్రకాష్( ఆంధ్రప్రదేశ్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్లుగా శివప్రసాద్ (ఆంధ్రప్రదేశ్), చైర్మన్‌గా మోహన్‌సింగ్ రాథోడ్ (మధ్యప్రదేశ్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 206 ఆర్గనైజేషన్లలో సేవ చేసే భాగ్యం తనకు లభించిందని, కొత్తగా గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గం తనను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నాలుగేళ్లలో భారతదేశం నలుమూలల కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేస్తామని, ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాడీ బిల్డింగ్ అసిసోయేషన్ అభివృద్ధికె నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు గున్నం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు




నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.ప్రతి నెల నాల్గవ ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గున్నం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన రెడ్డి కమ్యూనిటీ పేద కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. యువత సేవా కార్యక్రమాల పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ రామిరెడ్డి, సనత్ కుమార్ రెడ్డి, ప్రజేందర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్ రెడ్డి, అనిల్ రెడ్డి, శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేయాలి...

**వెంకటగిరి మేజర్ న్యూస్ :** వెంకటగిరి క్రాస్ రోడ్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని 12వ తేదీన అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేయడాన్ని ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆయన తెలియ జేశారు. అనంతరం తిరుపతి జిల్లా ఇంచార్జ్ మంద పెంచలయ్య మాదిగ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యాన్ని కూనిచేసిన అయిందని వెంటనే దుర్మార్గులను అరెస్టు చేసి కోర్టు ఆధారపరచాలని చెప్పి 6 తేదీ దాక ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలియజేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ మంగలపురి సురేష్, సీనియర్ నాయకులు పల్లిపాటి రవి మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దాంట్లో సూత్రధారులు ఎవరో పాత్రధారులు ఎవరో వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వెంకటగిరి నియోజకవర్గాన్ని 6 తేదీ పైన దిగ్బంధం చేస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కంటిపల్లి మనీ, వాన రాజ్ కుమార్మా, చింతకుంట అంకయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి సన్మానం



**పలమనేరు, మేజర్ న్యూస్:** సంప్రదాయ కళల పరిరక్షణసంస్థ గొల్లచీమనల్లి బైరెడ్డి పల్లి మడవళి చిరంజీవిని భారతీయ ప్రాచీన సంప్రదాయ సంస్కృతి కళలను కళాకారలను వివిధరంగాలలో సేవలందించిన వారిని ఒకవేదిక మీదకు చేర్చి తెలంగాణ, ఆంధ్ర కర్ణాటక తమిళనాడు రాష్టాలనుండి వచ్చినవారందరికి సకల సదుపాయలు కల్పంచి 116 మందిని సన్మాన సత్కార పురస్కారాలు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమం ప్రాచీన కళలను అన్నమాచార్యలు పేరుతోచజరపడం పురప్రజలు పెద్దలు ప్రముఖులు కళాభిమానుల ఆదరాభిమానాలు చూపిండం మహొన్నత మైనదని యోగ గురు నందగోపాల్ తెలిపారు. అదేవిదంగాభారత ప్రాచీన సంస్రృతి సాంప్రధాయం కళలు మొదైలన సేవలఅందిస్తున్న యోగ గురు నందగోపాల్ కు పలు సామజిక సేవలందిస్తున్న సేవాకార్యకర్త మధుమోహన్ రావ్ లను ఘనంగా సన్మానించారు. మడవళి చిరంజీవి మరిన్నికార్యక్రమాలు చేపట్టి జీవం పోయాలని అభినందలుతెలిపారు.

## పేదలకు నిత్యావసరాలు పంపిణీ



**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా పొణకా ఆది శేషారెడ్డి జ్ఞాపకార్థం పొణకా మల్లికార్జున రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతలు సహకారంతో తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టమన్నారు. దాతల సేవలు మరువలేనిదన్నారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పదాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 'ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులు రామ్మోహన్ రావు , టీచర్ మామదూరు రాధయ్య , ప్రభాకర్, రాము, శివ కుమార్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## దువ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డికి మాతృవియోగం



**నాయుడుపేట, మేజర్ న్యూస్:** నాయుడుపేట మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ దువ్వూరు లక్ష్మీనారాయణ రెడ్డి తల్లి దువ్వూరు సుజాతమ్మ(84) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు లక్ష్మి నారాయణ రెడ్డి నివాసానికి చేరుకొని సుజాతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లక్ష్మీనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## బిల్డింగ్ వర్కర్ అధ్యక్షుడుగా శేఖర్



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** శ్రీ బాలాజీ బిల్డింగ్ వర్కర్ యూనియన్ నగర అధ్యక్షుడుగా మల్ల కుప్పం శేఖర్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం కొర్లగుంట ఆ యూనియన్ కార్యాలయంలో పూర్వ అధ్యక్షులు మునికృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన అధ్యక్షులుగా మల్ల కుప్పంశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. మిగిలిన యూనియన్ కమిటీ ప్రతినిధులను జూన్ రెండో తారీఖున నిర్వహించే సమావేశంలో ఎంపిక చేయనున్నట్లు పూర్వ అధ్యక్షులు మునికృష్ణరెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన ప్రజ్ఞ

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** వడమాలపేట మండల పరిధిలోని పాదిరేడు బైపాస్ రోడ్డు వద్ద మోటార్ బైక్ ను కాంటైనర్ ఢీ కొనడంతో తమిళనాడుకు చెందిన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. తమిళనాడు, తిరువళ్లూరు జిల్లా, పొన్నేరు కు చెందిన ప్రజ్ఞ (35) ప్రమాదంలో మృతి చెందింది. శనివారం తిరుమల కు వెంకటేశ్వర స్వామి దర్శనార్థం పొన్నేరికి చెందిన విజయకాంత్, ప్రజ్ఞ దంపతులు శ్రీవారిని దర్శించి ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్తుండగా పాదిరేడు బైపాస్ వద్ద వెనుక వస్తున్న కాంటైనర్ ఢీ కొంది. దీంతో అదుపుతప్పి మోటారబైక్ బోల్తా పడడంతో ప్రజ్ఞ అక్కడికక్కడే మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహన్ని పోస్ట్ మార్టరం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ. ధర్మారెడ్డి తెలిపారు.

# వైసీపీలో ఆరణికి అడుగడుగునా అవమానం

### : బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్




**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను ఐదేళ్ల వైకాపా పాలనలో అడుగుడిన అవమానపరిచి అనగదొక్కి నామమాత్ర ఎమ్మెల్యే చేసిన చరిత్ర ఉందని బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ఆరోపించారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన తరుపున గ్రేటర్ రాయలసీమ పరిధిలో పోటీ చేసిన ఏకైక బలిజ నాయకుడు ఆరణి శ్రీనివాసులను దెబ్బ తీయడానికి రకరకాల కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి చేస్తున్న కుట్రలను వ్యక్తి పరిస్థితిలో ఉపేక్షించమన్నారు. ఆరణి శ్రీనివాసులకు రాయలసీమ జిల్లాలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అణిచివేసే ప్రయత్నానికి పాల్పడుతున్నారన్నారు. ఇందులో భాగంగా సోషల్ మీడియాను వేదికగా చేసుకుని లేనిపోని ఆరోపణలు చేస్తూ రెచ్చగొట్టే పనుల చేయిస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో బాధితులందరూ బలిజ కులస్థులేనని అన్నారు. ఆరణి శ్రీనివాసులకు ఏదైనా హని తలపెడితే గ్రేటర్ రాయలసీమ పరిధిలోని కాపు, బలిజలంతా ఏకమై అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బలిజసేన నాయకులు బెల్లంకొండ సురేష్, బండ్ల లక్ష్మీపతి, చెరకుల నీలాద్రి, గుండాల వేణురాయల్, బాసికర్ల రఘు పాల్గొన్నారు.

# బాల సుందరం రెడ్డి మృతి బాధాకరం

**- ఆయన లోటు పార్టీకి, వ్యక్తిగతంగా నాకు తీరని తీర్చలేనిది**
**- టీడీపీ సీనియర్ నాయకుని మృతికి సంతాపాన్ని తెలియజేసిన మాజీ మంత్రి అమర్ దంపతులు**



**పలమనేరు, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి సభ్యులు బాల సుందరం రెడ్డి మృతి బాధాకరమని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్య సమస్యతో శనివారం బాల సుందరంరెడ్డి మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న అమరనాథ రెడ్డి ఆయన సతీమణి రేణుకా రెడ్డితో కలసి ఆదివారం బాలసుందరం రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అనంతరం బాలసుందరం రెడ్డి సేవలను ఆయన కొనియాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశారని,తనకు వ్యక్తిగతంగా రాజకీయాలలో వెన్నంటి ఉండి క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరుగా రాణించారని కొనియాడారు. నేడు ఆయన లేని లోటు పార్టీకి తనకు వ్యక్తిగతంగాను తీర్చలేనిదని ఆయన ఆవేదన వ్యక్తం. ఈ సంతాప కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి బజారు వీది చిల్డ్రన్స్ ఫ్యాన్సీ షాప్ నందు గల ప్రత్యేక ప్రతి భావంతులకు ప్రతి నెల నిత్యవసర సరుకులను హెల్పింగ్ హాండ్స్ సంస్థ నేడు149 వ నెల సేవా కార్యక్రమాన్ని హెల్పింగ్ హాండ్స్ అధినేత మునీర్ బాషా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు పాల్గొని ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్య అవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోవిళ్ళ హరినాథ్ నాయుడు, బాబా ఫరీద్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్ సంస్థ

# కోనేటిని వదలని కబ్జారాయుళ్లు!

**- మొన్న చెరువు, నిన్న దేవాదాయ భూములు, నేడు కోనేర్లు ఆక్రమణ**

చౌడేపల్లి, మేజర్‌న్యూస్: పట్టణంలో దేవాదాయ భూములు, కోనేర్లు అధికముగా ఉన్నాయి. దేవాదాయ భూముల పైన కన్ను పడిన కబ్జారాయుళ్ళు ఈ మద్య కాలంలో దేవాదాయ భూములను మావని ఆక్రమించడం జరిగింది. అక్కడ ఆక్రమణ జరుగుతుందని అక్కడికెళ్ళి ఫోటోలు తీసుకుంటున్న ఒక జర్నలిస్టును ఆక్రమణ దారుడు తన అనుచరులను జర్నలిస్టు పైకి ఉసిగొల్పి ఎవడైనా అడ్డొస్తే నరికేస్తాం అంటూ మాట్లాడినారు. రెండుమూడు రోజులు గడచిన తర్వాత ఎవరో పునాదులు త్రవ్వుతున్నారని అక్కడికి వెళ్ళి ఫోటోలు తీస్తున్న జర్నలిస్టును చూసి ఆక్రమణ దారుడు, ఆవుల రామచంద్ర కుమారుడు పవన్ ఫోన్ చేసి ఆక్రమణ దారులను, మాజీ యం.పి.పి శ్రీరాం రెడ్డి ప్రకాష్‌ను పిలిపించి దుర్భుషలాడుతూ ఇక్కడ ఒక ఇటుక పెట్టాలన్నా మా అనుమతి తీసుకోవాలని, పెన్ను నీది, పేపర్ నీది ఏమిరాస్తావో రాసుకో అని హంగా చేశారు. ఇదే వార్తాకథనం రాస్తే చౌడేపల్లి సర్పంచ్ శ్రీరాం భరత్ వరున్ ఫోన్ చేసి నీ పైన డీ ఫాంనేషన్ షూట్ వేస్తాము, దేవాదాయ కమీషన్ కు పిర్యాదు చేశానని జర్నలిస్టు అంటే మేము సర్పంచులం మాకు అధికారమిచ్చినది ఎందుకు ఆక్రమణలను అడ్డుకోవడానికి అని మాట్లాడటం జరిగింది. ఐతే గత రెండుమూడు రోజుల నుండి చౌడేపల్లి గంగమ్మ గుడి ఎదురుగా ఉన్న కోనేరును ఆక్రమణ దారులు పూడ్చివేస్తుంటే ఈ అధికారం ఎటుపోయింది. అంటే మీవాళ్ళు పూడ్చుతుంటే, మీ వాళ్ళు ఆక్రమిస్తుంటే ఊరుకుంటారు. ఎవరైనా బడుగు బలహీన వర్గాల వాళ్ళు ఆక్రమించుకొని ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో కాస్త ఆలోచించండి. నిన్నటి దాకా దేవాదాయ భూములు ఆక్రమణ జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నారు. ఇప్పుడు కోనేర్లు పూడ్చుతుంటే అధికార దుర్వినియోగం చేస్తున్నారు. ఇంతలా జరుగుతుంటే దేవాదాయ అధికారులు. ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. అంటే దేవాదాయ భూములు ఆక్రమణ అధికారులకు పట్టదా? వెంటనే సంబందిత అధికారులు దేవాదాయ భూములను కాపాడాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుకుంటున్నారు.



# ఎన్నికల కౌంటింగ్‌కు వేళాయరా...

**కార్డెన్ సెర్చ్, నాకాబంది ప్రారంభమయ్యేరా...!**
**పాత రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్లు, అనుమానితులకు చెక్ పెడుతున్న పోలీసులు**
**ఇంటింటి జల్లెడ పట్టే కార్యక్రమానికి శ్రీకారం**
**రికార్డులు లేని కారు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు సీజ్**
**నేరాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన**
**ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేందుకు తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో రంగంలోకి దిగిన డీఎస్పీ, సిఐ, ఎస్ఐలు, సిబ్బంది**
**శభాష్ అంటున్న స్థానిక ప్రజలు**



**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్, నాకాబంది జిల్లా పోలీసులు నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ దృష్ట్యా ఎన్నికలకు సంబంధించిన రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, అనుమానితులను నిలువరిస్తూ ప్రశాంత వాతావరణంలో ఓట్ల కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడమే ధ్యేయం. అంతేకాకుండాఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్నందున జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీల పర్యవేక్షణలో ఆదివారం తెల్లవారుజాము నుండి ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన పాత నేరస్తులు, రౌడ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేసి, ఎలాంటి రికార్డులు లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం జరిగింది. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్, నాకాబంది నిర్వహిస్తున్నారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ఆధ్వర్యంలో మల్లంగుంట పంచాయతీ గరుడాద్రి, వెంకటాద్రి అపార్ట్మెంట్ల ప్రాంతాలలో ఒక కారు, మూడు ఆటోలు, 35 మోటార్ సైకిళ్లు సీజ్ చేశారు. నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ఆధ్వర్యంలో బీడీ కాలనీ ప్రాంతంలో 44 ద్విచక్ర వాహనాలు సీజ్ చేయడం జరిగింది. ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ఆధ్వర్యంలో ఏర్పేడు పట్టణంలో 15 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. అలాగే తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ఆధ్వర్యంలో 30 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. స్థానికులతో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ఎన్నికల నియమావళి అమలులో ఉన్నదని, పాటించాలని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ రోజు ఎలాంటి గొడవలకు, ర్యాలీలు పాల్గొనవద్దని చెప్పారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 144 సిఆర్‌పిసి అమలులో ఉంటుందని, దానిని అతిక్రమించి అనవసరంగా క్రిమినల్ కేసులలో పాల్గొంటే వచ్చే నష్టాలను గురించి పోలీసు అధికారులు వివరించారు. పోలింగ్ రోజున ప్రజలు ఇప్పటికే తమ నిర్ణయాన్ని ఇచ్చారని, కేవలం ఫలితాలు మాత్రమే జూన్ 4వ తేదీన వెలువడుతాయనే విషయాన్ని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు గుర్తించుకుని ప్రశాంతంగా జీవిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా సమాజంలో జరిగే నేరాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్, నాకాబంది కార్యక్రమాలలో ఆయా సబ్ డివిజన్ల సీఐలు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బోయకొండలో భక్తుల రద్దీ

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మ నుదర్శించుకోవడానికి ఆంధ్ర కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ఉదయం 6 గంటలకు బారులు తీరారు వర్షం సైతం లెక్కచేయకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి మొక్కులు తీర్చుకోవడానికి ముడుపులతో క్యూలైన్లను మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు ఆదివారంసెలవు రోజు కావడం అయినందువల్ల స్కూల్ విద్యార్థులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో చంద్రమౌళి త్రాగు నీరు తీర్థప్రసాదాలు అందరికీ అందేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పెదబోగము చిన్న బోగము సమర్పించే ప్రదేశాన్ని చైర్మన్ నాగరాజ రెడ్డి, కార్య నిర్వాహణ అధికారి చంద్రమౌళి, సభ్యులు పవన్ లు సందర్శించారు. అర్చకులు గంగిరెడ్డి కృష్ణప్ప సుధాకర్ రాము రాజన్న ప్రసాద్ చిన్న గంగిరెడ్డి ఆలయ సిబ్బంది రామనాథం కృష్ణారెడ్డి సుధాకర్ రెడ్డి సురేందర్ రెడ్డి సూరి వీర కుమార్ తాతయ్య పాల్గొన్నారు.



# సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ఆర్బీఐ

**- కార్పొరేట్ రంగాలకు ఊడిగం చేసే నిర్ణయాలు**
**- జేవీ సత్యనారాయణమూర్తి**

**తిరుపతి మున్సిపల్, మేజర్‌న్యూస్ :** సహకార బ్యాంకింగ్ వ్యవస్థను ఆర్.బి.ఐ నిర్వీర్యం చేస్తుందని వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జెవి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కేవలం కార్పొరేట్ బ్యాంకింగ్ వ్యవస్థకు, కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే నిర్ణయాలు చేస్తోందని విమర్శించారు. ఆదివారం సాయంత్రం తిరుపతి బైరాగి పట్టెడలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ తిరుపతి బ్రాంచ్ సభ్యుల మహాసభ జరిగింది. ఈ సభలో బ్యాంక్ ఇన్చార్జి డైరెక్టర్లు నారాయణస్వామి, జే వి సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సహకార రంగంతోనే సామాన్యుల జీవన ప్రమాణం మెరుగుపడుతుందని, అలాంటి వ్యవస్థను ప్రోత్సహించకుండా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఆర్బిఐ నిర్ణయాలు చేస్తోందని జెవి సత్యనారాయణమూర్తి చెప్పారు. ఆర్బిఐ పుట్టకముందే సహకార వ్యవస్థ ఏర్పడింది అన్నారు. ప్రజల డిపాజిట్ లతో సహకార బ్యాంకులు అభివృద్ధి చెందిన పరిస్థితి వుందన్నారు. దేశంలో ఉపాది అవకాశాలు తగ్గిపోయింది అన్నారు. అర్హతకు తగ్గ ఉపాధి అవకాశాలు లేవు అన్నారు. సహకార బ్యాంకుల వ్యవస్థ పై ఆర్ బి ఐ నియంత్రణ ఎక్కువ అయిందని మండి పడ్డారు. బ్యాంకింగ్ రంగంలో కార్పొరేట్ బ్యాంకులకు ఆర్బిఐ ఊడిగం చేస్తుందన్నారు. జాతీయ బ్యాంకులు బడా కార్పొరేట్ వ్యవస్థలకు రుణాలు ఇస్తున్నాయని అయితే సహకార బ్యాంకులో సామాన్యుడికి రుణాలు ఇచ్చి సహకరిస్తున్నాయని చెప్పారు. బంగారంపై లోన్లు ఇవ్వడంలో సహకార బ్యాంకులు ముందు వరుసలో ఉన్నాయని అన్నారు. వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 40 శాతం రుణాలు బంగారు పై ఇవ్వడం జరుగుతుంది అని పేర్కొన్నారు. రెండు లక్షల వరకు బంగారు రుణాలు ఇవ్వాలని సహకార బ్యాంకులకు ఆంక్షలు విధించారని, అదే జాతీయ బ్యాంకుల విషయంలో నియంత్రణ లేకుండా ఆర్బిఐ వ్యవహరిస్తోంది అన్నారు. 10 లక్షల రూపాయల వరకు బంగారం రుణాలపై పరిమతి ఉంచాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. కేవలం నాలుగు లక్షల వరకు మాత్రమే ఇవ్వాలని అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు సొంత ఇంటి కోసం స్థలం కొనుగోలు చేస్తే దాని కోసం ఇచ్చే రుణాలపై నియంత్రణ పెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వ్యవసాయ పంటలకు రుణాలు ఇవ్వడానికి వీలు లేకుండా చేశాన్నారు. సహకార లేకుంటే మానవ మనుగడ లేదు అన్నారు. సహకార వ్యవస్థ తోనే సామాన్య ప్రజల స్థితి గతులు మెరుగు అవుతుంది అన్నారు. సహకార బ్యాంకులలో ప్రతి పైసా ప్రతి సభ్యుడికి హక్కు వుంటుంది అని పేర్కొన్నారు. పన్ను విధింపులో కూడా ఆర్‌బిఐ వ్యత్యాసం చూపించింది అన్నారు. ఆదాయ పన్ను విషయంలో కార్పొరేట్ బ్యాంకులకు తక్కువ స్థాయిలోనూ, సహకార బ్యాంకులకు ఎక్కువ స్థాయిలో విధించడం జరిగిందన్నారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థలోని అందరి పోరాట ఫలితంగా ఆదాయ పన్ను 25 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సభ్యులుగా ఉన్న వారి పిల్లలు చదువులకు, మరణించిన సభ్యుల వారసులకు సంక్షేమనిధి నుండి డబ్బులు ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. గత సంవత్సరం 5.5కోట్ల రూపాయలు బ్యాంకు సభ్యుల సంక్షేమానికి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. సభ్యుల ఆరోగ్య బీమా పథకాన్ని స్వతహాగా నిర్వహించుకోవడానికి వున్న అవకాశాల్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. బ్యాంకు సభ్యుల సంఖ్యతో పాటు షేర్‌లు పెంచుకోవాలని కోరారు. దేశంలో ఉన్న సహకార బ్యాంకు లలో వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ నాలుగవ స్థానంలో నిలిచిందని చెప్పారు. దీనిని మరింత అభివృద్ధి చేయడానికి సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ వెంకటేశు, బ్రాంచ్ మేనేజర్ సునీత, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కాణిపాకం ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ

**ఐరాల, మేజర్ న్యూస్:** కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో స్వామి వారిసందర్శ నార్థం భక్తులు రద్దీ భారీగా పెరిగింది. వేసవి సెలవులు కావడంచేత మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి స్వామివారి సందర్శ నార్థం ప్రతి రోజు లక్షల మంది భక్తులు తరలిరావడం జరుగుతుంది.అందులోభాగంగానే ఆదివారం వివిధ సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఉచిత దర్శనం,100 రూపాయలు శీఘ్ర దర్శనం, 150 రూపాయలు అతిశీఘ్ర దర్శనం వంటి క్యూలైనులో స్వామి వారి సందర్శనార్థం బారులు తీరినారు. అయితే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గ కుండా ఆలయ ఈవో ఎ.వెంకటేశు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించి తగుచర్యలు తీసుకొని స్వామివారి దర్శనం భాగ్యం కల్పించారు. ఆలయ అధికార్లు,ఆలయ సిబ్బంది తనవంతు సేవలు అందించారు.

జనం కోసమే సూర్య
నేటి దినపత్రిక సూర్యలో జర్నలిజంలో ఆసక్తి కలవారు తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట నియోజకవర్గం నుండి నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, ఓజిలి, వెంకటగిరి నియోజకవర్గం నుండి బాలాయపల్లికి ఇంచార్జ్‌లు కావలెను. మరిన్ని వివరాల కొరకు కింద కనబరచిన వారిని సంప్రదించగలరు.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

జనం కోసమే సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116